క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల,కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్ట్ గంటల ప్రాతిపదికన ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ విభాగంలో ఎకనావిక్స్ సబ్జెక్ట్ ఖాళీగా ఉందన్నారు. తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు బోధించవలసి ఉంటుందని, దరఖాస్తుదారులు పీజీ, బీఈడీ పూర్తి చేసి అర్హత కలిగి ఉండాలన్నారు. 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల : రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వర్గాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు పర్లపెల్లి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ.రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఐదు సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్ల అశోక్, నేరెళ్ల రమేశ్, రత్న రమేశ్, మట్టివాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

భూపాలపల్లి అర్బన్ : రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ గుండ్ల ఓంకార్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హులకు ఎకరం వ్యవసాయ భూమి, 200గజాల ఇంటి స్థలం కేటాయించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, రఘుపతి, రంజిత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మాపూర్‌లో చోరీ

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదు కాజేశారు. ఎస్సై పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మాపూర్ గ్రామానికి చెందిన శంకరమ్మ మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లింది. పనులు ముగించుకొని ఇంటికి వచ్చి చూసే వరకు గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం, ఇంట్లో ఉన్న బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న రూ.10 వేల నగదు దొంగలించారు. శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆంక్షలు ఎత్తేయాలి

భూపాలపల్లి అర్బన్ : ఆర్టీసీ కార్మిక సంఘాలపై గత ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుదారి రమేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేసి తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. పీఎఫ్, ఎస్ఆర్‌బీ, ఎస్‌బీటీ ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను నియమించాలన్నారు. ఆర్టీసీ కార్మికులు, నాయకులు సుభాన్, రవికుమార్, ఉమా, అజారుద్దీన్‌లు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

చిట్యాల : మండల వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నందకుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. రాయకుల మొగిలి, సయ్యద్ గాలిఫ్, మైదం శ్రీకాంత్, వల్లాల ప్రవీణ్, చింతల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిట్యాల : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి చెందిన ఉమ్మగాని రాజేశ్వరీ, ఏలేటి రామయ్యపల్లికి చెందిన గొర్రె మల్లయ్య, కొత్తూరి రాంరెడ్డిలు ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ మంగళవారం పరామర్శించి ఓదార్చారు.

విజయవంతం చేయాలి

కాటారం : జిల్లా కేంద్రంలో ఈ నెల 21, 22 తేదీలో జరగనున్న సీపీఎం మూడో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోలం చిన్నరాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 21 భారీ ర్యాలీ ఉంటుందని అనంతరం మహాసభలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

23న అథ్లెటిక్స్ ఎంపికలు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 23వ తేదీన జూనియర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోక్కూరి చిన్నరాజయ్య, పూతల సమ్మయ్య తెలిపారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు

- పట్టించుకోని అధికారులు


మొరం తవ్విన వెంకట్రావుపల్లి గుట్ట

టేకుమట్ల : మండలంలో మొరం తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతుంది. యాసంగిలో చెరువుల్లో కొనసాగిన మొరం తవ్వకాలు ప్రస్తుతం గుట్టలపై చేపట్టడంతో ప్రకృతి సంపద పూర్తిగా అంతరించిపోతుంది. ప్రభుత్వ పథకాల పేరుతో నిత్యం మొరం తవ్వకాలు ఎక్కడపడితే అక్కడ నిర్వహిస్తున్నారు. అవసర నిమిత్తం పట్టా భూముల్లో మొరం తవ్వకాలు చేపట్టాలంటే తప్పనిసరిగా మైనింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలి. అనుమతిలో భాగంగా ప్రభుత్వానికి పన్ను సైతం చెల్లించాలి. కానీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు యథేచ్ఛగా రాత్రి, పగలు లేకుండా ఎక్కడపడితే అక్కడ మొరం తవ్వకాలను చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. సెప్టెంబర్‌లో అంకుషాపూర్ శివారు కొత్త చెరువు కట్టను పట్టపగలే ప్రొక్లెయినర్ సహాయంతో ఏకంగా కట్టనే తవ్వి మొరాన్ని తరలించారు. అంతే కాకుండా బూర్నపల్లి, బోయినిపల్లి, వెంకట్రావుపల్లి గుట్టల్లో అక్రమ తవ్వకాలు నిరంతరం కొనసాగుతున్నాయి. గర్మిళ్లపల్లి శివారు జింకల బోరు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారీతిన మొరం తవ్వకాలను చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

వెంకట్రావుపల్లి తాటి వనం గుట్ట నుంచి..

మండలంలోని వెంకట్రావుపల్లి తాటివనంలోని గుట్టనుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మొరం తవ్వకాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో మొరం తరలిస్తున్న టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్, మైనింగ్ అధికారులు పట్టుకుని వదిలేయడంతో మొరం అక్రమ రవాణా నిరంతరం కొనసాగుతూ అక్రమార్కులకు వరంగా మారింది.

రెవెన్యూ అధికారులు వారించినా..

వెంకట్రావుపల్లి తాటివనంలోని గుట్ట నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలించొద్దని పలుమార్లు హెచ్చరించినా మొరం రవాణా ఆగడం లేదు. అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మొరం తరలించడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, మైనింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అక్రమ మొరం తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని మండల ప్రజలు కోరుతున్నారు.


మొరం తరలిస్తున్న టిప్పర్

అనుమతి ఇవ్వలేదు



వెంకట్రావుపల్లి గుట్టనుంచి మొరం తరలించేందుకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. అక్కడి నుంచి మొరం తరలిస్తున్నారనే సమాచారంతో అక్కడికి పనులను నిలిపివేసాం. మళ్లీ కొనసాగితే కేసులు నమోదు చేస్తాం. నిబంధనలకు లోబడి ఉండాలి. అతిక్రమిస్తే కేసులు తప్పవు.

– విజయలక్ష్మి, తహసీల్దార్

కేసులు నమోదు చేయాలి



నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మొరం తవ్వకాలను చేపట్టే వాహనాలను వెంటనే సీజ్ చేసి, తవ్వకాలకు పాల్పడున్న అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలి. అధికార పార్టీ నాయకుల అండదండలతో దందా కొనసాగుతుంది. కలెక్టర్, మైనింగ్ అధికారులు దృష్టిసారించాలి.

– మారెపల్లి మల్లేశ్, టేకుమట్ల

'నిరాధార ఆరోపణలు తగవు'

కాటారం : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ యూత్ నాయకుడు శ్రీనుబాబుపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి చేస్తున్న ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. చల్ల నారాయణరెడ్డి, పుట్ట మధు ఇద్దరు కలిసి రాజకీయ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో శ్రీధర్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారని స్వయంగా ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్నో సమావేశాల్లో చెప్పారని తెలిపారు. ఇద్దరికి పదవులు పోవడంతో మతిభ్రమించి ఇలా మాట్లాడుతున్నారు. పదవులు, అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీలు మారే నారాయణరెడ్డి అసత్యపు వ్యాఖ్యలను నమ్మి బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడటం సరికాదన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు నాయిని శ్రీనివాస్, నవీన్‌రావు, అంగజాల అశోక్, కోడి రవి, కొట్టె ప్రభాకర్, కొట్టె శ్రీహరి, చీమల రాజు, గడవేన దేవేందర్, భూపెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చర్య తీసుకోవాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాళేశ్వరం : మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌పై హత్యకు పన్నిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఓ యూట్యూబ్ చానల్‌లో చల్లా నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, అతని సోదరుడు శ్రీనుబాబులు తనతో పుట్ట మధుకర్‌ను హత్య చేయడానికి ప్రోత్సహించారని తెలిపారు. ఆ ఘటనపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకొని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. మహిళ నాయకులు గీతాబాయి, నాయకులు మనోహర్, శ్రీపతి బాపు, అలీంఖాన్, ప్రకాశ్, రాజశేఖర్, స్వప్న, రమేష్, అనంత లక్ష్మీ, శంకర్ తదితరులు ఉన్నారు.

పెద్దపులి సంచారం..?

పలిమెల: మండలంలోని కామన్‌పల్లి - ముకునూరు రహదారిలోని కిష్టాపురం పహాడ్ వద్ద పెద్దపులి సంచరిస్తుందని ఫొటోను పలిమెల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్ స్టేటస్ పెట్టుకోవడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఉదయం పలిమెల, ఏటూరునాగారం రేంజ్ పరిధిలోని అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి సదరు వ్యక్తిని పెద్దపులిని చూసిన ప్రాంతానికి తీసుకెళ్లగా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. చుట్టూ పక్కల సుమారు ఐదు కిలో మీటర్ల మేర అటవీ శాఖ చెందిన ఆరు టీంలు వెతికినప్పటికీ పులి అడుగు జాడలు(కాలి ముద్రలు) కానరాలేదని పలిమెల రేంజ్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. బుధవారం కూడా పులి జాడలపై ఖచ్చితమైన సమాచారం తెలుసుకుంటామని చెప్పారు. కామన్‌పల్లి, ముకునూరు, తదితర గ్రామాలకు చెందిన పశువుల, మేకల కాపర్లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పులి అరుపులు, జాడలు తెలిసినా అటవీ శాఖ అధికారులకు తెలపాలని సూచించారు.


సిబ్బందితో మాట్లాడుతున్న సీసీఎఫ్ ప్రభాకర్

పర్యవేక్షించిన ఉన్నతాధికారులు..

కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పులి కోసం అటవీ శాఖ బృందాలు చేస్తున్న తనిఖీని పర్యవేక్షించారు. ఎలాంటి అనవాళ్లు ఉన్నా తెలపాలని, ఒక వేళ పులి ఉన్నట్లయితే పులికి అపాయం జరగకుండా చూడాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఏటూరునాగారం ఎఫ్‌డీఓ రమేష్, పలిమెల రేంజ్ ఆఫీసర్ నాగరాజు, మహదేవ్‌పూర్ రేంజ్ ఆఫీసర్ రవి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ ఆఫీసర్ అక్సర్ ఉన్నీసా, సెక్షన్, బీట్, బేస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కాటారం : మహాముత్తారం మండలం ప్రేమ్‌నగర్, పెగడపల్లి, బోర్లగూడెం, యామన్‌పల్లి గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. భూపాలపల్లి ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ లింగాచారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. దాడుల్లో భాగంగా 1,800 లీటర్ల చక్కెర పానకం, తయారీ సామగ్రిని ధ్వంసం చేసి 25 లీటర్ల నాటు సారా, 150 కిలోల చక్కెర స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న 8 మందిపై కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయం, రవాణాలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ సీఐ నాగేశ్వర రావు, భూపాలపల్లి డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజనమ్మయ్య, ఎస్సైలు రజిత, కిష్టయ్య పాల్గొన్నారు.


పట్టుబడిన గుడుంబా, చక్కెరతో పోలీస్ అధికారులు

నూతన కమిటీల ఎన్నిక

మల్హర్ : ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ ఆదేశాల మేరకు ముదిరాజ్ మహాసభ మండల కమిటీ, యువజన కమిటీ, విలేజ్ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు అక్కినేని సమ్మయ్య ముదిరాజ్, జిల్లా యువత ఉపాధ్యక్షులు ముద్రవేణి సురేష్ ఆధ్వర్యంలో ముదిరాజ్ మహాసభ మండల ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజు, ఉపాధ్యక్షులుగా కుంట సదానందం, జోడు నది, కార్యదర్శిగా ఇండ్ల మహేందర్, ప్రచార కార్యదర్శి బోనగిరి లక్ష్మణ్, సహకార కార్యదర్శిగా జోడు శ్రీను, ముఖ్య సలహాదారుడు జోడి చంద్రయ్యను ఎన్నుకున్నారు. అలాగే మహాసభ యువత మండల అధ్యక్షుడిగా ఆకుల సతీష్, ఉపాధ్యక్షుడిగా కొంతం దేవేందర్, ప్రధాన కార్యదర్శి దుండి రమేష్, ప్రచార కార్యదర్శిగా పేయల సురేష్, ముఖ్య సలహాదారుడు ఆకుల నరేష్, కోశాధికారి కుంట సతీష్‌లతో పాటు మహాసభ తాడిచర్ల గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

ఒడిపిలవంచ గ్రామ కమిటీ..

కాటారం : అఖిల భారత యాదవ మహాసభ కాటారం మండలం ఒడిపిలవంచ గ్రామ కమిటీని మంగళవారం యాదవ సంఘం డివిజన్ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మొగిలి ఓదన్నయాదవ్, అధ్యక్షుడిగా వేముల రమేశ్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా మొగిలి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎలవేన రాజేందర్, కోశాధికారిగా వేముల శ్రీను, సహాయ కార్యదర్శిగా ఎలవేన మహేందర్ ఎన్నికయ్యారు. అడహక్ కమిటీ సభ్యులు నూతన కమిటీకి ఎన్నిక పత్రం అందజేసి అభినందనలు తెలిపారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

చిట్యాల : ఝాన్సీ లక్ష్మీబాయిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏబీవీపీ చిట్యాల శాఖ, ప్రాంత కార్యసమితి సభ్యుడు వెల్పుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీశక్తి దివస్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, రాజకీయ రంగాల్లో రాణించాలని కోరారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ.. సమాజంలో మనకు మనమే రక్షణగా నిలువాలని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారిని, రాష్ట్రస్థాయి క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్‌గౌడ్, నాయకులు అభిగ్న, వితిష్, రాకేష్, సన్నీకృష్ణ, సాంబమూర్తి పాల్గొన్నారు.

చిట్యాల : ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని చిట్యాల మండల కేంద్రంలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జడలపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎ.వైష్ణవి ప్రథమస్థానంలో నిలిచింది. కె.వాసంతి, ఉపాధ్యాయులు మధు, లక్ష్మీ, లావణ్య, లింగయ్య, శరత్ బాబు, రఘుపతి, రజిత విద్యార్థిని అభినందించి బహుమతి అందజేశారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

కాటారం : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు సూచించారు. మండలంలోని గారెపల్లి, కొత్తపల్లి, శంకరాంపల్లి, రేగులగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం వారు పరిశీలించారు. ధాన్యం తేమ తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్లు, తూకం మిషన్లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కొనుగోళ్లు సక్రమంగా సాగించాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనల ప్రకారం తేమ ఉన్న ధాన్యం తూకం వేయాలని ఆదేశించారు.


కాటారం: వివరాలు సేకరిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్హర్ : తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల, పెద్దతూండ్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్య ప్రకాశ్ రావు, డైరెక్టర్స్ వోన్న తిరుపతిరావు, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, మాజీ సర్పంచ్ రాజు నాయక్, మాజీ ఉప సర్పంచ్ ఇందారపు చంద్రయ్య, మెరుగు రాజయ్య, బానోత్ కిషన్, కేసరపు చంద్రయ్య, గడ్డం క్రాంతి, బండి స్వామి, మేనం శ్రీనివాస్, పుప్పాల రాజు, నాగేశ్వర్ రావు, శ్రీనివాస్, మహేష్, రైతులు, హమాలీలు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం తనిఖీలు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం లక్ష్మినారాయణ మంగళవారం భూపాలపల్లి ఏరియాలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ 2, 3 ప్రాజెక్టుల్లోని కోల్ యార్డ్, ఎస్‌పీఈసీ క్యాంపులో డీజిల్ బంక్, చెక్ పోస్టులను పరిశీలించారు. అనంతరం ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డిని కలిసి ఏరియా ఎస్టేట్ సమస్యలు, భూ ఆక్రమణలు, క్వార్టర్ల వివరాల గురించి చర్చించారు.


తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ జీఎం లక్ష్మినారాయణ

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఏరియా జీఎం కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలిసి జీఎం స్థల పరిశీలన చేపట్టారు. కార్యాలయంలోని ఖాళీ ప్రదేశంలో అందరికీ కనిపించేలా సుందరంగా ఏర్పాటు చేయాలని సివిల్ డీజీఎం రవికుమార్‌ను జీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాగేశ్వర్‌రావు, ఎంవీ రావు, సంజీవరావు, అధికారులు పాల్గొన్నారు.

సీసీఎఫ్‌ను కలిసిన జీఎం..

సీసీఎఫ్ ప్రభాకర్‌ను ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో సింగరేణి అభివృద్ధికి అటవీ శాఖ నుంచి రావాల్సిన అనుమతులు, కావాల్సిన సహకారం గురించి జీఎం చర్చించారు. ఈ కార్యక్రమంలో జియోలాజీ ఏజీఎం శివనారాయణ, అడిషనల్ మేనేజర్ పోషమలుల్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

ఇందిరమ్మ పాలనే ఆదర్శం..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


భూపాలపల్లి అర్బన్ : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ రెడ్డి

భూపాలపల్లి అర్బన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పాలన స్ఫూర్తితోనే ఆదర్శ పరిపాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికి దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని ఇందిరాగాంధీ ముందుకు సాగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మధు, సాంబమూర్తి, మధుకర్‌రెడ్డి, మహేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

టేకుమట్ల : దివంగత నేత, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన కోసం ఎంతో కృషి చేసిన మహానీయురాలు ఇందిరమ్మ అని అన్నారు. ఇందిరమ్మ కలల రాజ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపెడుతోందని, అందులో భాగంగానే సంక్షేమ పథకాలను అమలు చూస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి, శాస్త్రాల కిరణ్, కత్తి సంపత్, చిరంజీవి, నరేష్, ఎలవేని రాజేందర్, అల్లం ఓదెలు, కమ్రోద్దిన్, కట్ల లస్మయ్య, వైనాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


టేకుమట్లలో..

రేగొండ : మండల కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిట్యాలలో..

చిట్యాల : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, నాయకులు దొడ్డి కిష్టయ్య, మూల శంకర్ గౌడ్, దబ్బెట అనిల్, బుర్ర లక్ష్మణ్, బుర్ర శ్రీనివాస్, మార్కండేయ, బోట్ల రవి, నాసర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

గణపురం : మండలంలోని చెల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 1000 క్వార్టర్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 230 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గణపురం ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. చెల్పూరు గ్రామానికి చెందిన పున్నం అజయ్ ఒరిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నాడని తెలిపారు.అందులో భాగంగా మంగళవారం ఉదయం 1000 క్వార్టర్స్ సమయంలో అజయ్ కుమార్ గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు అతనిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


అరెస్టు చూపుతున్న పోలీసులు